క్లుప్తంగా

మే డే వేడుకలను జయప్రదం చేయండి..



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: 139వ మే డే వేడుకలను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) జిల్లా ఉపాధ్యక్షుడు రాలయ సిద్ధు పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడులో మే డే వాల్‌పోస్టర్లను ఆటో కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మే డే వేడుకలను వాడవాడలా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు నేలాల నరసింహారావు, అశోక్, అఖిల్, బాబు, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అవంతికకు ‘ఏకలవ్య’లో సీటు

టేకులపల్లి: టేకులపల్లి మండలం వాగొడ్డుతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న గుగులోతు అవంతిక టేకులపల్లి మండలం బద్దు తండాలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించింది. ఆదివారం ఏకలవ్య ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. తమ కూతురికి ఏకలవ్యలో సీటు రావడం ఆనందంగా ఉందని అవంతిక తల్లిదండ్రులు సీపీఐ జిల్లా నాయకుకడు గుగులోత్ రాంచందర్ సోనీ తెలిపారు.

ఐరన్ బ్రిడ్జి పనులు పునఃప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందు: ఇల్లెందులపాడు వద్ద అలుగు వాగు మీదుగా హిందూ శ్మశానవాటికకు వెళ్లేందుకు బ్రిడ్జి లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో సింగరేణి సహకారంతో తాత్కాలికంగా ఐరన్ వంతెన నిర్మించేందుకు నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించి, పిల్లర్లు నిర్మించి వదిలేశారు. దీంతో ఈ నెల 21న బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేనా..? శీర్షికతో సాక్షి దినపత్రికలో వార్తాకథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్‌ను అప్రమత్తం చేశారు. ఆదివారం బ్రిడ్జి పనులు పునఃప్రారంభించారు.

30న నిరసన, ధర్నా

టేకులపల్లి: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపు కొరకు ఈనెల 30న సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట నిరసన దీక్ష, ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జేఏసీ నాయకులు షేక్ యాకూబ్ షావలి, కుడుదుల వీరన్న, భానోత్ రాంసింగ్, జరుపుల సుందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం టేకులపల్లి సింగరేణి కాలనీలోని మస్టర్ అడ్డా వద్ద జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు నరసింహారావు, పాయం వెంకన్న, ఏసుటి నాగయ్య , గుగులోత్ మదార్, శివయ్య, ప్రసాద్, ఎర్రమ్మ షేక్ బాబు, సోమయ్య, షఫీ, మౌనిక, కౌసల్య, సూర్య పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

టేకులపల్లి: గంగారం గ్రామానికి చెందిన కొర్సా శైలజకు ఆదివారం పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వాహనం వచ్చి ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో పురిటి నొప్పులు ఎక్కువగా కావడంతో ఈఎంటీ భాగ్యమ్మ ఈఆర్ సీపీ డాక్టర్ శ్రీకాంత్ సలహా మేరకు మార్గమధ్యలోనే డెలివరీ చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఎంసీహెచ్ రామవరం ఆస్పత్రిలో చేర్పించారు.

బస్టాండ్‌లో సమస్యలు తిష్ట

- అపరిశుభ్రంగా ప్రయాణికుల ప్రాంగణం
- మరమ్మతులకు గురైన అద్దె షాపులు
- ఏళ్ల తరబడి తాళాలు



పాల్వంచ బస్టాండ్

పాల్వంచ: పాల్వంచ ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలు తిష్ట వేశాయి. నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు వచ్చిపోతుంటారు. అయితే దశాబ్దాల క్రితం నిర్మించింది కావడంతో పండుగలు, కొన్ని ప్రత్యేక రోజుల్లో బస్టాండ్ సరిపోవడం లేదు. ప్రయాణికులతో కిటకిటలాడుతుంది. ఈ క్రమంలో నూతన ప్రాంగణం నిర్మించాలని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా ఈ ప్రాంగణంలోని పలు షాపులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటికి మరమ్మతులు చేసి అద్దెలకు ఇవ్వాల్సి ఉండగా ఎవరూ పట్టించుకున్న దిక్కు లేదు. క్యాంటీన్, షాపులు నిరుపయోగంగా ఉన్నాయి. బస్టాండ్‌కు వచ్చిపోయేవారు పార్కింగ్‌లో వాహనాలకు అద్దె చెల్లించి పార్కింగ్ చేస్తుంటారు. అయితే అక్కడ షెడ్డు చిన్నగా ఉండడంతో డబ్బులు చెల్లించినా చాలా వాహనాలు చెట్ల కిందనే ఉంచాల్సి వస్తోంది. బస్టాండ్‌లో సుమారు ఎకరన్నర స్థలం ఖాళీగా ఉంది. దానిని సద్వినియోగం చేసుకుని షెడ్డు పెద్దదిగా నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. ఖాళీ స్థలంలో కాటన్ బజార్, చైనా బజార్ వంటి షాపులకు అద్దెకు ఇస్తే ఆర్టీసీ ఆదాయం కూడా వచ్చే అవకాశం ఉందంటున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్..

బస్టాండ్‌కు కాంట్రాక్టర్స్ కాలనీ వైపు నుంచి వచ్చే దారిని సీసీ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలంలో సమస్య ఉండదని చెబుతున్నారు. వర్షాకాలంలో బస్టాండ్ ఆవరణం అంతా వాననీరు నిల్వ ఉంటుంది. బస్టాండ్ చుట్టూ డ్రెయినేజీ నిర్మాణం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇక దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అధికారులు స్పందించాలని విన్నవిస్తున్నారు.

పార్కింగ్ సమస్యతో సతమతం..

ఇక బస్టాండ్‌లో వచ్చే వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం లేదు. రెండు వైపుల నుంచి వాహనదారులు బస్టాండ్‌కు వచ్చి ప్రయాణికులను దింపి వెళ్తుంటారు. దీంతో ఒక్కోసారి బస్సుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. కాగా ప్రైవేట్ వాహనాలు బస్టాండ్‌లోకి వచ్చే క్రమంలో వాటికి ప్రత్యేకంగా ఏదైనా ఒకవైపు స్థలం కేటాయిస్తే సమస్యల ఉండదని పలువురు చెబుతున్నారు. బస్టాండ్ లోపల ముందు భాగం చాలా స్థలం ఖాళీగా ఉంది. దీనిని పార్కింగ్‌కు కేటాయించాలని కోరుతున్నారు.



చెట్ల కింద పార్క్ చేసిన వాహనాలు

సమస్యలు పరిష్కరించాలి..



బస్టాండ్ ఆవరణలోని దుకాణాలు మరమ్మతులకు గురయ్యాయి. వాటికి రిపేర్లు చేసి అద్దెకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. బస్టాండ్ ముందు భాగంలో సీసీ రోడ్డు వేయాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. బస్టాండ్‌లో ఖాళీ స్థలాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కె.రవి, పాల్వంచ

పార్కింగ్ ఏర్పాటు చేయాలి..



ప్రైవేట్ వాహనాలు బస్టాండ్‌లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. బస్టాండ్ ముందు భాగంలో చాలా స్థలం ఖాళీగా ఉంది. పిచ్చి చెట్లు పెరిగి అధ్వానంగా ఉంది. ఆ స్థలాన్ని పార్కింగ్ కోసం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– కల్యాణ్ రామ్, ప్రయాణికుడు

సమస్యలను పరిష్కరిస్తాం..



బస్టాండ్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం. ఖాళీగా ఉన్న షాపులను త్వరలోనే టెండర్‌కు పిలుస్తాం. గతంలో టెండర్ పాడి అగ్రిమెంట్ చేసుకోక పోవడంతో ఖాళీగా ఉన్నాయి. బస్టాండ్ ముందు ఖాళీ స్థలాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటాం.

– దేవేందర్ గౌడ్, కొత్తగూడెం డిపో మేనేజర్

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఇల్లెందురూరల్: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఇఫ్టూ అనుబంధ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు సారంగపాణి డిమాండ్ చేశారు. 139వ మేడేను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని కొమరారం, పోలారం గ్రామపంచయతీల పరిధిలో ఆదివారం మేడే ప్రచార పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చి ఏడు దశాబ్దాలు పూర్తయినా నేటికీ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. మేడే వేడుకల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వాంకుడోత్ హచ్చ, జీవన్, నరేష్, సురేష్, శ్రీను, కిషన్, రమేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

రేపు ఆందోళన కార్యక్రమాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధ వేతనాల హక్కులకై జేఏసీ హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఈనెల 29న జీఎం కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోలిండియా వేతనాలు, లీవులు, పండుగ సెలవులు, ఈఎస్ఐ వైద్యం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా కార్మికులకు పీఎఫ్, బోనస్ కల్పించాలని డిమాండ్ చేశారు.

భూ భారతి సదస్సు వాయిదా

పాల్వంచరూరల్: జగన్నాథపురం రైతువేదికలో ఆదివారం నిర్వహించనున్న భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును ఈనెల 30వ తేదీకి వాయిదా వేసినట్లు తహసీల్దార్ వివేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహించడం జరుగుతుందని రైతులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



2003–04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థినులతో ఉపాధ్యాయినులు

పాల్వంచ: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత (అభ్యుదయ) పాఠశాలలో 2003–04 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థినులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులను సన్మానించారు. పాఠశాలకు రెండు వాటర్ ఫిల్టర్‌లను వితరణగా అందజేశారు. సహపంక్తి భోజనాలు చేసి రోజంతా సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు రమ, నాగమల్లేశ్వరి, కామేశ్వరి, లత, కమలజా, పూర్వ విద్యార్థులు శ్రీవాణి, పద్మ, చైతన్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పెహల్గాం మృతులకు నివాళి



కొత్తగూడెంఅర్బన్: బస్టాండ్ సెంటర్‌లో కొవ్వొత్తులతో అసోసియేషన్ సభ్యులు, స్కౌట్స్



పాల్వంచ: జెన్‌కో కాలనీ వద్ద నివాళులు అర్పిస్తున్న ఇంజనీర్ల కుటుంబాలు



సింగరేణి(కొత్తగూడెం): చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారికి ఆదివారం నివాళులర్పించారు. తొలుత కొవ్వొత్తులతో అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉగ్రదాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం, సింగరేణి అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ కమిషనర్ బి.సుశీల్, వరప్రసాద్, 40 మందికి పైగా రోవర్ స్కౌట్ లీడర్స్, స్కౌట్ మాస్టర్లు, స్కౌట్స్ పాల్గొన్నారు.

పాల్వంచ: కశ్మీర్‌లో ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆదివారం సాయంత్రం స్థానిక జెన్‌కో కాలనీలో ఇంజనీర్ల కుటుంబాలు కలిసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

ప్రధాన గేటు వద్ద నివాళులర్పించారు. ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ ఉమా మహేశ్వరరావు, జయభాస్కర్, ప్రవీణ్, దివాకర్, రామారావు, పావని, రజిత, యశోద, కృష్ణ, శిరీష, భవానీ ప్రసాద్, భాస్కర్, నవీన్, సంధ్య పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ..

సింగరేణి(కొత్తగూడెం): జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ సెయింట్ పీటర్ చర్చి రుద్రంపూర్ సంఘం కాపరి పి.అనిల్‌కుమార్, సెక్రటరీ రవి రత్నరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఆరాధన అనంతరం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ.. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి దాడులు బాధాకరమన్నారు. ర్యాలీలో కొత్తగూడెం ఏరియా జీఎం శాలేంరాజు, తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: జమ్మూ కశ్మీర్‌లోని పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి వ్యతిరేకంగా సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కొమ్ముగూడెంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్, యాసా నరేష్, బానోత్ ఇస్రా, బిచ్చు, శంకర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరగాలి



ఇళ్ల నిర్మాణాల గురించి అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన పూబెల్లి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి నిర్మాణ తీరును తనిఖీ చేశారు. మాట్లాడుతూ.. వారం రోజుల్లో మరోసారి పరిశీలిస్తామని, గృహ నిర్మాణాల తీరులో మార్పు కనిపించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ డేవిడ్, కార్యదర్శి బాలకృష్ణ, పులి సైదులు, అరెం కిరణ్, మండల రాము మహేష్, పూనెం సురేందర్, నాలవెల్లి నర్సింహారావు, ధనుంజయ్, శ్రీకాంత్, శారద తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

కొత్తగూడెంఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన, అవగాహన కల్పించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న అన్నారు.

ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలను, అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ శ్రేణులదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు చెప్పే విషయంలో వెనకబడిపోయామని, ప్రజాప్రభుత్వ పాలన గురించి ప్రజాక్షేత్రంలో చెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో అల్లూరి కృష్ణవేణి, దివ్య, కళ్యాణి, ఎల్.పాదిలి జ్యోతి, బోడ దివ్య, పందాల సరిత, బండ్ల రజిని, గుగులోతు కమలమ్మ, బర్ల నాగమణి, సున్నం లక్ష్మి, బురుగు పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ పోరాటం ఫలించింది..

ఇల్లెందు: ఏఐటీయూసీ పోరాట ఫలితంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు యాజమాన్యం పింఛన్ సదుపాయం కల్పించినట్లు ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య అన్నారు. ఆదివారం ఇల్లెందులోని విఠల్‌రావు భవన్‌లో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. సారయ్య మాట్లాడారు. ఈ సమావేశంలో డి.శంకర్, నజీర్ అహ్మద్, రాజారాం, అజ్మీర కిషోర్, ఉప్పయ్య, విజయ్‌కుమార్, స్వరూప, సోమయ్య, హసీనా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు...

గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ ఇచ్చిన హామీల అమలు కోసం యాజమాన్యంతో చర్చించి ఒక్కొక్కటికి అమలు జరుగుతోందని, ఇందులో భాగంగానే యాజమాన్యం జీఓలు విడుదల చేస్తోందని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య అన్నారు.

ఆదివారం జేకే ఓసీలో జరిగిన ఫిట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. జనరల్ మజ్దూర్‌లను జనరల్ అసిస్టెంట్లుగా మార్చుతూ జీఓ వచ్చిందన్నారు. మెరిట్ స్కాలర్‌షిప్ రూ.10 వేల నుంచి రూ.16 వేలు పెంచుకోవటం జరిగిందన్నారు. అర్హత ర్యాంకు 2 వేల నుంచి 8 వేలకు పెంచినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజారామ్, జయరాజ్, తిరుమలరావు, శ్రీనివాస్, ప్రసాద్‌రెడ్డి, పైడిరాజు, తురాయి సతీష్‌కుమార్, నాదేండ్ల శ్రీనివాసరెడ్డి, వి.రమేష్, సత్యరాజ్, షకీల్, రవి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి



టేకులపల్లి: నిరసన తెలుపుతున్న న్యూడెమోక్రసీ, పీవైఎల్ నాయకులు

ఇల్లెందురూరల్: ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపి వేసి మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కొమరారం గ్రామంలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో కర్రెగుట్ట వద్ద నాలుగు రోజులుగా మిలటరీ బలగాల చర్యలు యుద్ధాన్ని తలపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆదివాసీలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో సంతు, పాడుగు నర్సింహారావు, మోతీలాల్, నర్సయ్య, మూడు మాలు, జోగ కృష్ణ, శ్రీను, వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

సైనిక బలగాలను వెనక్కి రప్పించాలి

టేకులపల్లి: మూడు రోజులుగా ములుగు ప్రాంతంలో 200 కిలోమీటర్లు విస్తరించి ఉన్న కర్రెగుట్టను 20వేల సైనిక బలగాలు చుట్టుముట్టి జల్లెడ పడుతున్నారని ఆదివాసీలను, మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరున చంపివేస్తున్నారని వస్తున్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నేత దుబాకుల ప్రసాద్ అన్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం టేకులపల్లి సెంటర్ నల్లబ్యానర్‌తో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నోముల భానుచందర్, తోటకూరి సతీష్, బిచ్చ, బోడ మంచా, మేకల వినోదు, సురేష్, మజ్ను, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష

ఇల్లెందు: కాంగ్రెస్ 17 నెలల పాలనలో ప్రజలకు కేసీఆరే శ్రీరామ రక్ష అని రాష్ట్ర ప్రజలకు అర్థం అయిందని బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. ఆదివారం ఇల్లెందు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ జెండాను ఎగుర వేసి, వరంగల్‌లో జరగనున రజతోత్సవ సభకు బయలుదేరారు. మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రాష్ట్ర 25 వసంతాల రజతోత్సవ సభ ఇంటి పండుగగా మారిందన్నారు. ఊరువాడ తరలి వెళ్లి సభను విజయవంతం చేసేందుకు పోటీ పడుతున్నారని, కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో దేవీలాల్ నాయక్, సిలివేరు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వరరావు, ఎస్ రంగనాథ్, జాఫర్ హుస్సేన్, జేకే శ్రీనివాస్, శీలం రమేష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, బీఆర్ఎస్ పార్టీ వరంగల్‌లో చేపట్టిన రజతోత్సవ సభతో తెలంగాణలో కాంగ్రెస్ జీరో అవుతుందని కొత్తగూడెం మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. ఆదివారం వరంగల్ సభకు పార్టీ కార్యకర్తలతో బయలుదేరే ముందు రామవరంలోని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం కార్యాలయంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాపు కృష్ణతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించి, మాట్లాడారు.

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నాయి. చల్లసముద్రం గ్రామపంచాయతీ కూడలిలో అయిలు నారాయణ గులాబీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో పార్టీ శ్రేణులు ఆవిర్భావ సభకు తరలివెళ్లారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): వరంగల్‌లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆదివారం కొత్తగూడెం నియోజకవర్గం నుంచి వివిధ వాహనాలలో బీఆర్ఎస్ శ్రేణులు చేరుకున్నారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఇల్లెందు క్రాస్‌రోడ్‌లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వరంగల్‌కు తరలివెళ్లారు.

పాల్వంచ: మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పలువురు బస్సులు, కార్లలో వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ సభకు ఆదివారం బయలు దేరారు. పాత పాల్వంచలోని వనమా గృహంలో వనమా దంపతులకు మహిళా కార్యకర్తలు హారతి పట్టారు. అనంతరం భారీ జనసందోహంతో, డప్పు వాయిద్యాలతో బయలు దేరారు.

పాల్వంచరూరల్: వరగంలోని ఎల్కతుర్తి వద్ద ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పాల్వంచ మండలంలోని ఆ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. జగన్నాథపురం, నాగారం, పాండురంగాపురం, ఉల్వనూరు, కిన్నెరసాని తదితర గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానాలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

జూలూరుపాడు: వరంగల్‌లో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున తరలివెళ్లారు. మండల కేంద్రం జూలూరుపాడులో బయలుదేరిన బీఆర్ఎస్ శ్రేణుల భారీ ర్యాలీని పార్టీ వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు, యల్లంకి సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. వరంగల్ వెళ్లిన వారిలో పీజీ క్రిష్ణమూర్తి, చావా వెంకటరామారావు, మూడ్ చిట్టిబాబు, దుద్దుకూరి నాగేశ్వరరావు, సాయిన్ని హరీష్, కట్రం మోహన్‌రావు, భూక్యా రాములు, బానోత్ చిన్నా, లకావత్ హేమ్లా, బానోత్ శంకర్, చాపలమడుగు రామ్మూర్తి, బానోత్ హరిలాల్, బానోత్ చందర్, వాడా వెంకటేశ్వర్లు, పుల్లయ్య, భూక్యా జవహర్‌లాల్ తదితరులు ఉన్నారు.

సుజాతనగర్: ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు భారీగా తరలివెళ్లారు. తొలుత మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎండాను ఎగరేసి నినాదాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులు, కార్లలో వెళ్లారు. కార్యక్రమంలో రెడ్డెం తులసిరెడ్డి, బత్తుల వీరయ్య, లావుడ్యా సత్యనారాయణ, పెద్దమల్ల నరేంద్ర, తుంపూరి రాములు, వేములపల్లి సత్యనారాయణ, మామిడాల సాంబశివరావు, కత్తి బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

టేకులపల్లి: వరంగల్‌లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు టేకులపల్లి మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. తొలుత టేకులపల్లి, సులానగర్, బోడు, కొత్తతండా(జి) తదితర గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేశారు. ఆ తరువాత పార్టీ ఏర్పాటు చేసిన బస్సుల్లో వరంగల్ సభకు బయలుదేరి వెళ్లారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొమ్మెర వరప్రసాద్, బోడ బాలుతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాల్వంచ: సభకు బయలుదేరే ముందు మంగళహారతి పడుతున్న మహిళా కార్యకర్తలు



సింగరేణి(కొత్తగూడెం): రజతోత్సవ సభకు బస్సులో బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు



ఇల్లెందు: రజతోత్సవ సభకు బయలుదేరుతున్న బీఆర్ఎస్ శ్రేణులు